క్లుప్తంగా

నాణ్యమైన భోజనం వడ్డించాలి



పుల్లేటికుర్రులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, తహసీల్దార్

అంబాజీపేట: మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, తహసీల్దార్ జె.వెంకటేశ్వరి సూచించారు. పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం వంటశాలలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంట చేసే ప్రాంతం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులంతా భోజనం చేసేలా వంటలు రుచిగా ఉండాలని నిర్వాహకులకు సూచించారు. వారి వెంట ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, హెచ్ఎం కనకదుర్గ, పీఎంసీ చైర్మన్ నూకల శ్రీరత్నమాల ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



చొప్పెల్లలో దివ్యాంగులకు సూచనలు ఇస్తున్న హెచ్‌ఆర్‌ఆర్‌ఏఏఐ అధ్యక్షురాలు రజని

ఆలమూరు: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి తమ సంస్థ కృషి చేస్తుందని హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా (హెచ్‌ఆర్‌ఆర్ ఏఏఐ) అధ్యక్షురాలు అమ్మిరెడ్డి రజని అన్నారు. చొప్పెల్లలో విభిన్న ప్రతిభావంతుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి గురువారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సుకు (హెచ్‌ఆర్ ఆర్‌ఏఏఐ) అధ్యక్షురాలు రజని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అలాగే స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను విని న్యాయ సలహాలు అందించి పరిష్కార మార్గాలు సూచించారు. విభిన్న ప్రతిభావంతుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు మామిడిశెట్టి వెంకట రమణారావు, కార్యదర్శి వై.లక్ష్మీనరసింహాచార్యులు, సభ్యులు పాల్గొన్నారు.

బాధితుడి వైద్యానికి చేయూత



బాధితుడికి రూ.12 వేల చెక్కును అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యుడు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు గురువారం చేయూత అందించారు. పశ్చిమ గోదావరి జిల్లా వెంకటాద్రిఅప్పారావు మండలం కాకర్లమూడి గ్రామానికి చెందిన చికిలే శివకుమార్ (35)కు కొన్ని రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నారు. పూర్తి వైద్యానికి ఆర్థిక స్థోమత లేక ఇంటికి వచ్చేశారు. ముగ్గురు పిల్లలతో ఇల్లు గడవడం కష్టంగా ఉండడంతో కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులు స్పందించి రూ.12 వేల సాయం చేశారు.

మాజీ మంత్రి వేణు పరామర్శ



ఆలమూరులో మునీశ్వరమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి వేణు

ఆలమూరు: ఆలమూరులో మాతృ వియోగంతో బాధపడుతున్న వ్యాపారవేత్త, మండల కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావును మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ దంపతులు పరామర్శించారు. స్థానిక పసుపులేటిగూడెంలో ప్రభాకరరావును గురువారం ఆయన కలిశారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి చైర్మన్‌గా పనిచేసిన మాతృమూర్తి మునీశ్వరమ్మ మృతికి గల కారణాలను ఆమె కుమారులు ప్రభాకరరావు, నానాజీ, భూషణం తదితర కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. చల్లా కుటుంబీకులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే పారిశ్రామికవేత్త వైట్ల కనక దుర్గారావు, రావులపాలెం, రామచంద్రపురం సీఐలు కె.శేఖర్‌బాబు, సీహెచ్ విద్యాసాగర్, పి.దొరరాజు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

రికార్డుల పరిశీలన

అయినవిల్లి: వీరవల్లిపాలెం పంచాయతీలోని రికార్డులను ఎంపీడీఓ జి.భీమారావు గురువారం పరిశీలించారు. సొసైటీ ఓటర్, సిటిజన్ సర్వే వేగవంతం చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది మూవ్‌మెంట్ రిజిస్టర్‌ను తప్పనిసరిగా రికార్డు చేయాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ సలాది బుచ్చిరాజు, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

సుజలం అందేనా!

- రక్షిత నీటి పథకానికి గ్రహణం
- ఏళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోని వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



మాచవరంలో నిరుపయోగంగా ఉన్న మంచినీటి పథకం

అంబాజీపేట: గుక్కెడు నీరు గగనమైంది.. ప్రజా సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతోంది.. ఏళ్లు గడుస్తున్నా రక్షిత మంచినీటి పథకం ప్రారంభానికి ఎదురు చూస్తోంది. ప్రజలకు తాగునీరు అందించాలనే ఆలోచన ఎవరికీ లేకపోవడంతో పథకానికి గ్రహణం పట్టింది. రెండు దశాబ్దాల కాలంగా కాలయాపన జరుగుతూనే ఉంది. మాచవరం మంచినీటి పథకం పనులు 2003లోనే ప్రారంభమయ్యాయి. అది పూర్తయినా నేటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదు. రెండు నెలల క్రితం మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రకటించినా అమలుకు మాత్రం నోచుకోలేదు. అసలు తమ మంచినీటి సమస్య తీరుతుందా అని ప్రజలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. తాగునీటిని కొనుగోలు చేయలేక స్థానికుల ఇంటి వద్ద బోర్లు, బావుల నుంచి నీటిని తెచ్చుకుని తాగాల్సి పరిస్థితి నెలకొందని అంటున్నారు.

అప్పటి నుంచీ ఇలానే..

మేజర్ పంచాయతీ అయిన మాచవరంలో సమగ్ర రక్షిత మంచినీటి పథకం (సీపీడబ్ల్యూఎస్) ద్వారా ప్రజలకు తాగునీరు అందించాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రాజెక్ట్ నిర్మాణ పనులు మొదలు పెట్టింది. కామయ్యకోడు వద్ద ఉన్న ఏడెకరాల డ్రైన్‌ను ఆధునీకరించి మంచినీటి చెరువుగా మార్చుచేశారు. 2019 ఎన్నికలకు ముందు మంచినీటి ప్రాజెక్టును ప్రారంభిద్దామనుకుంటే మళ్లీ అవాంతరం ఏర్పడింది. రాపిడ్ సాండ్ ఫిల్టర్ బెడ్ (ఆర్ఎస్ఎఫ్)కు బదులు మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేయడం, అవి తుప్పుపట్టడంతో స్థానికులు ఆందోళన చేశారు. దీంతో ఆర్ఎస్ఎఫ్ నిర్మాణం కోసం అదనంగా మరో రూ.2.5 కోట్లు మంజూరు చేయడంతో వాటర్ ప్లాంట్ నిర్మించారు. వాటర్ ట్యాంకుల నుంచి తాగునీటిని ప్రజలకు సరఫరా చేసేందుకు అవసరమైన హైడ్రో పాలిమార్ (హెచ్‌పీఈ) పైపులైన్లు, ఇంటింటికీ తాగునీటి కుళాయిల పనులు పూర్తి కాకపోవడంతో మంచినీటి సరఫరా జరగడం లేదు. గ్రామానికి మంచినీరు అందించేందుకు ఐదు ట్యాంకులు కూడా నిర్మించారు. కామయ్య 3 కోడు వద్ద 2.5 లక్షల లీటర్ల సామర్థ్యం, పక్షుల రావిచెట్టు సమీపంలో 1.20 లక్షల లీటర్లు, కె.పెదపూడి వంతెన సమీపంలో 60 వేల లీటర్లు, స్థానిక పశువుల సంత వద్ద 1.5 లక్షల, 1.20 లక్షల లీటర్ల సామర్థ్యంతో ట్యాంకులు నిర్మించారు.

చెరువు నీరు కలుషితం

మంచినీటి పథకానికి అడుగడుగునా అవాంతరాలు ఏర్పడడంతో రెండు దశాబ్దాలు పైగా చెరువులో నీరు నిల్వ ఉండిపోవడంతో మొత్తం కలుషితంగా మారిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ (రక్షణ గోడ), స్ట్రీట్ లైట్లు లేకపోవడంతో చెరువులో పడి ఇద్దరు మృతి చెందారు. ఇప్పటికైనా ఇక్కడ రక్షణ గోడలు నిర్మించి, తాగునీటి పథకాన్ని వినియోగంలోకి తీసుకురావాల్సి ఆవశ్యకతం ఎంతైనా ఉంది.

త్వరలోనే ప్రారంభిస్తాం



మంచినీటి పథకాన్ని త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నిర్వహణకు సంబంధించిన ప్రక్రియ టెండర్ల దశలో ఉంది. అది పూర్తికాగానే నీరు అందిస్తాం. గ్రామ పరిధిలో 95 శాతం పైపులైన్లు పూర్తి చేశాం. త్వరలోనే ఇంటింటికీ తాగునీరు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

–జయశ్రీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ అంబాజీపేట

పట్టించుకునే వారు లేక..



కామయ్యకోడులో రెండు దశాబ్దాల కిందట నిర్మించిన రక్షిత మంచినీటి పథకం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. ప్రజాప్రతినిధులు, అధికారుల కాలయాపన తప్ప దాని అభివృద్ధి గురించి పట్టించుకునే వారు లేరు. త్వరితగతిన ప్రారంభించి ప్రజల దాహార్తి తీర్చాలి.

–ఉందుర్తి నాగబాబు, మాచవరం

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

అంబాజీపేట: ముక్కామల సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఈఈ ఎం.రవికుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కముజువారిలంక, శ్రీరామ్‌పురం, చినలంక, చిరతపూడి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కొత్తపేట: మోడేకుర్రు పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్ ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ ఈఈ రవికుమార్ తెలిపారు. మోడేకుర్రు, గొలకోటివారిపాలెం గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల సరఫరా ఉండదన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

సారా విక్రేతల అరెస్ట్

ఆలమూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మండలంలోని వివిధ గ్రామాల్లో సారా విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఎక్సైజ్ సీఐ ఐడీ నాగేశ్వరరావు కథనం ప్రకారం.. బడుగువానిలంకలో సారా విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించి జాన లక్ష్మి, మారిశెట్టి ఏసురత్నంను అరెస్ట్ చేశారు. వారి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గురువారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిందితులను హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారు.

విధులపై అవగాహన అవసరం



ముంగండలో జరిగిన శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఈఓ సలీం బాషా



మామిడికుదురు సమావేశంలో మాట్లాడుతున్న సీఎంఓ సుబ్రహ్మణ్యం

మామిడికుదురు: పాఠశాలల యాజమాన్య కమిటీల విధులు, బాధ్యతలు, బడి బయట పిల్లలను బడిలో చేర్పించడం తదితర అంశాలపై ఎస్ఎంసీ చైర్మన్లు, హెచ్ఎంలు దృష్టి సారించాలని ఎస్ఎస్ఏ సీఎంఓ బీవీవీఎస్ సుబ్రహ్మణ్యం సూచించారు. మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల పరిధిలోని ఎస్ఎంసీ చైర్మన్లు, హెచ్ఎంలకు శిక్షణా కార్యక్రమం జరిగింది. దీనిని ఎంఈఓలు లక్ష్మీనారాయణ, మెకా వెంకన్నబాబు పర్యవేక్షించారు. మన బడి, మన భవిష్యత్తు లక్ష్యంతో పాఠశాలలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఎస్ఎంసీ చైర్మన్లు, హెచ్ఎంలు సమన్వయంతో ముందుకు రావాలన్నారు. రాష్ట్ర ఎస్ఆర్‌పీ గుండాబత్తుల నాగసత్యదేవి, స్థానిక జెడ్పీహెచ్ స్కూల్ హెచ్ఎం సీహెచ్ నిరంజని పాల్గొన్నారు.

అంబాజీపేట: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల అభివృద్ధిలో ఎస్ఎంసీ చైర్మన్లు, హెచ్ఎంలు భాగస్వాములు కావాలని ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ తెలిపారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో మండలంలో ఎస్ఎంసీ చైర్మన్లు, హెచ్ఎంలకు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడంతో పాటు ప్రతి విద్యార్థి పాఠశాలకు వచ్చే విధంగా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ట్రైనర్లు ఎ.సాయిరామ్, ఎన్.సుధాకర్‌బాబు, ఎస్.అరుణజ్యోతి, పి.త్రిమూర్తులు, జి.అమ్మాజీలు శిక్షణ ఇచ్చారు. హెచ్ఎం కడలి సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి పాటుబడాలి

పి.గన్నవరం: ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాఠశాలల అభివృద్ధికి పాటుబడాలని జిల్లా విద్యాశాఖ అధికారి సలీం బాషా సూచించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్లకు ముంగండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులు జరిగాయి. ఆయన మాట్లాడుతూ ఎస్ఎంసీ చైర్మన్లు, సభ్యులు తరచూ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విధంగా చూడాలన్నారు. ఎంఈఓలు కోన హెలీనా, చింతా వీరభద్రానందం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల ఉన్నతికి కృషి

అయినవిల్లి: ప్రభుత్వ పాఠశాలల ఉన్నతికి స్కూల్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ పి.శ్రీనివాసులు అన్నారు. ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంలు, స్కూల్ కమిటీ చైర్మన్లకు శిక్షణ జరిగింది. రిసోర్స్‌పర్సన్లుగా జి.సాయి శ్రీనివాస్, ఎ.కొండలరావు, ఎ.సూర్యనారాయణలు వ్యవహరించారు.

సంప్రదాయ క్రీడలను ప్రోత్సహిద్దాం



ఆలమూరు పోలీసు స్టేషన్‌లో ఎస్సై అశోక్‌కుమార్‌ను సత్కరిస్తున్న మహిళా పోలీసులు

ఆలమూరు: వచ్చే పండగలు, పర్వదినాలు, జాతరలు, తీర్థ మహోత్సవాల్లో సంప్రదాయ క్రీడలను ప్రోత్సహిద్దామని ఆలమూరు ఎస్సై ఎం.అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని 24 గ్రామ సచివాలయాల పరిధిలోని మహిళా సంరక్షణ కార్యదర్శు (పోలీసు)లతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా, కొట్లాటలు, గొడవలు జరిగినా సమాచారం అందించాల్సిన బాధ్యత మహిళ పోలీసులదేనన్నారు. పండగలు, పర్వదినాలను శాంతియుత వాతావరణంలో జరుపుకొనే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు, పోలీసులకు మధ్య వారధిలా పనిచేస్తూ గ్రామాల్లో సమస్యలను పోలీసు శాఖ దృష్టికి తీసుకు వస్తున్న మహిళా పోలీసులను ఆయన అభినందించారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్న ఎస్సై అశోక్‌కుమార్‌ను మహిళ పోలీసులు ఘనంగా సత్కరించారు.

కల్కి అలంకరణలో శ్రీవారు



రాయవరం: వేంకటేశ్వర భక్తజన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న దశావతార మహోత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారు గురువారం కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని కల్కి అవతారంలో అలంకరించి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాయవరం, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జిల్లా ఆర్యవైశ్య కమిటీలో ప్రాధాన్యం



శ్రీఘాకోళ్లపు లక్ష్మీ నారాయణ (బాబి)



పచ్చిపులుసు కృష్ణారావు



తమ్మన సాయిప్రసాద్

కొత్తపేట: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం, అనుబంధ కమిటీల్లో కొత్తపేటకు చెందిన ప్రతినిధులకు ప్రాధాన్యం కల్పించారు. ఆ మేరకు గురువారం సభ్యులు ఓ ప్రకటన విడుదల చేశారు. సంఘ ఉపాధ్యక్షుడిగా శ్రీఘాకోళ్లపు లక్ష్మీనారాయణ (బాబి), మెడికల్ కమిటీ చైర్మన్‌గా డాక్టర్ పచ్చిపులుసు కృష్ణారావు, పొలిటికల్ కమిటీ వైస్ చైర్మన్‌గా తమ్మన సాయిప్రసాద్‌ను నియమించారు. రాజమహేంద్రవరంలో ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో జిల్లా సంఘ గౌరవాధ్యక్షుడు కనకరాజు, అధ్యక్షుడు కంచర్ల బాబి, మాజీ అధ్యక్షుడు కోరుప్రోలు వెంకటేశ్వరరావు సమక్షంలో శివరామ సుబ్రహ్మణ్యం కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా వారిని జిల్లా, స్థానిక సంఘాల నాయకులు అభినందించారు.

వెంకన్నకు లక్షతులసి పూజ



ఇసుకపూడిలో వేంకటేశ్వర స్వామివారు

అంబాజీపేట: ఇసుకపూడి శివారు జక్కంశెట్టివారిపాలెం గ్రామంలో భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి సామూహిక లక్ష తులసి పూజను గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, అభిషేకాలు, సూర్యనమస్కారాలు, లక్షతులసి పూజ జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్న సమారాధన చేశారు.

ఘనంగా నిర్వహిద్దాం

స్థానిక కొర్లపాటివారిపాలెంలో భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష తులసి పూజను అందరి సహకారంతో ఘనంగా నిర్వహిద్దామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు పోస్టర్‌లను గురువారం ఆవిష్కరించారు. లక్షతులసి పూజా మహోత్సవం ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగపల్లి నర్సింహాచార్యులు పర్యవేక్షణలో జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మేడిద శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో గణపతి వీరరాఘవులు, కొర్లపాటి కోట బాబు, కొర్లపాటి గోపి, మేడిద చిన్న, నయినాల ప్రభాకర్, రవణం రాము పాల్గొన్నారు.



అంబాజీపేటలో లక్షతులసి పూజ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

వైభవంగా ధనుర్మాస పూజలు

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీరంగనాయక స్వామివారికి ధనుర్మాసం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గోపాలాచార్యులు, సాయినాథాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి విశేష అభిషేకాలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. లక్ష చామంతి, తులసి పూజ చేశారు. స్వామిని విశేషంగా అలంకరించారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



వీరవల్లిపాలెంలో స్వామివారికి విశేష పూజలు చేస్తున్న అర్చకులు

విజ్ఞానం వెల్లివిరిసేలా...

- ఆకట్టుకున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు
- జిల్లా స్థాయికి ఎంపికైన ఉత్తమ ప్రాజెక్టులు



ఆలమూరులో విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న అధికారులు



పుల్లేటికుర్రులో విజేత విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



ఈదరాడ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన తాజ్‌మహల్ నమూనా

కొత్తపేట: మండల స్థాయిలో జరిగిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల తమ ఆలోచనలతో సరికొత్త ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. గురువారం కొత్తపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. మండలంలో పాఠశాలల నుంచి మొత్తం 67 ప్రాజెక్టులను ప్రదర్శించారు. వ్యక్తిగత విభాగంలో వానపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన 'రెడ్యూస్ అగ్రిలాస్', కొత్తపేట కాంతి భారతి హైస్కూల్ విద్యార్థుల 'యాండర్ పౌచ్', గ్రూప్ విభాగంలో కొత్తపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థుల 'పెడీ ప్రొడక్ట్ సిస్టం', వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల 'రెయిన్ వాటర్ ప్యూరిఫైర్', టీచర్ విభాగంలో వానపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి సైన్స్ ఉపాధ్యాయుడు పి.శివశంకర్ రూపొందించిన 'ఈజీ మ్యాథ్స్' అనే ప్రాజెక్టులను న్యాయ నిర్ణేతలు ఉత్తమ ప్రాజెక్టులు గుర్తించారు. ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కె.లీలావతి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్‌లు బూసి జయలక్ష్మి, త్సామా బాబు, విళ్ల మారుతీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: విద్యార్థుల్లో నైపుణ్యాల మెరుగుకు సైన్స్ ప్రదర్శనలు ఉపయోగపడతాయని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్‌లో ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ పర్యవేక్షణలో హెచ్ఎం కేవీఎస్ కనకదుర్గ అధ్యక్షతన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. వ్యక్తిగత విభాగంలో సీహెచ్‌జేఎస్ దుర్గ (గంగలకుర్రు అగ్రహారం), ఆర్ఎస్ అన్నపూర్ణ (గంగలకుర్రు), ఐ.నాగచందు (పుల్లేటికుర్రు), గ్రూప్ విభాగంలో గంగలకుర్రు, ఇసుకపూడి, అంబాజీపేట, టీచర్ ప్రాజెక్ట్‌లో కేజీ నరసింహారావు (తొండవరం), జీఎస్‌జీఎస్ఎస్‌వీవీ రమణ (పుల్లేటికుర్రు), బి.ఉమాదేవి (ముక్కామల) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, పీఎంసీ చైర్మన్ ఎస్.రత్నమాల, వైస్ చైర్మన్ రాధాబాయ్, ఎంపీటీసీలు వడలి కృష్ణమూర్తి, పబ్బినీడి రాంబాబు పాల్గొన్నారు.

మామిడికుదురు: ఈదరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుందని ఎంఈఓ లక్ష్మీనారాయణ తెలిపారు. వ్యక్తిగత విభాగంలో ఈదరాడ స్కూల్ విద్యార్థి వై.ముఖేష్ ప్రదర్శించిన కార్బన్ ప్యూరిఫికేషన్ ఇన్ ఫ్యాక్టరీస్, నగరం సాయిదీప్తి స్కూల్ విద్యార్థి బి.పద్మావతి రూపొందించిన డైజెస్టివ్ సిస్టం, గ్రూప్ విభాగంలో లూటుకుర్రు విద్యార్థులు ఎస్.కవిత, కె.దివ్యశ్రీ ప్రదర్శించిన సొల్యూషన్స్ ఫర్ పొల్యూషన్, మామిడికుదురు దీప్తి స్కూల్ విద్యార్థులు ఎస్.భార్గవ్, ఎస్.ప్రదీప్ రూపొందించిన సర్వెంట్ రోబొట్, టీచర్స్ విభాగంలో మొగలికుదురు స్కూల్ ఉపాధ్యాయురాలు కె.చంద్రకుమారి ప్రదర్శించిన మల్టీపర్పస్ అగ్రికల్చర్ టూల్ ఎంపికయ్యాయని తెలిపారు. హెచ్ఎం జి.సాయిబాబు ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు.

సృజనకు పదును: డీఈఓ

ఆలమూరు: సృజనాత్మకతతో సరికొత్త ఆవిష్కరణలు చేయవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌కే సలీం బాషా అన్నారు. ఆలమూరు డాక్టర్ బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాలలో మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన వైజ్ఞానిక ప్రదర్శనను గురువారం ఆయన పరిశీలించారు. ఎంపీడీఓ రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. జిల్లా ఏఎంఓ పి.రాంబాబు, ఎంఈఓలు భమిడిపాటి అప్పాజీ, ఎస్‌వీ సుబ్బరాజు, ప్రిన్సిపాల్ వి.లక్ష్మణరావు, నోడల్ అధికారి జి.సీతారామశర్మ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: ముంగండ జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సలీం బాషా సైన్సు ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. మొత్తం 14 ప్రాజెక్టులను ప్రదర్శించగా ఇందులో 5 ప్రాజెక్టులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీఓ కె.విజయ ప్రసాద్, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, సర్పంచ్ కుసుమ చంద్రకళ, ఎంఈఓలు కోన హెలీనా, సీహెచ్.వీరభద్రానందం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శన

రాజోలు: విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని ఎంపీపీ కేతా శ్రీనివాస్ అన్నారు. రాజోలు బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. 50 ప్రాజెక్టులను ప్రదర్శించగా విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. మండల ఉపాధ్యక్షుడు పాలమూరి శ్యాంబాబు, ఎంఈఓ నల్లి మనోహరం, సర్పంచ్ రేవు జ్యోతి, ఎస్ఎస్ఏ కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి బొరుసు సుబ్రహ్మణ్యం, హెచ్ఎం కె.సరస్వతి పాల్గొన్నారు.

రావులపాలెం: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత, బాలురోన్నత పాఠశాలల్లో సైన్స్ ప్రదర్శనలు నిర్వహించారు. జెడ్పీటీసీ కుడిపూడి శ్రీనివాసరావు, పాఠశాలల ఎస్ఎంసీ చైర్మన్లు నందం వీర వెంకట సత్యనారాయణ, కోట సోమేశ్, తహసీల్దార్ ముక్తేశ్వరరావు, ఎంపీడీఓ మహేశ్వరరావులు ప్రదర్శనలను ప్రారంభించారు. విద్యార్థి విభాగం నుంచి ఊబలంక హైస్కూల్ విద్యార్థి ఎన్.నిఖిల్‌విజయ్‌కుమార్ రెడ్డి ప్రథమ, గ్రూప్ విభాగం నుంచి ఎ.దుర్గాసాయి, ఎ.నోబిదర్ ద్వితీయ స్థానం, ఉపాధ్యాయ విభాగం నుంచి దేవరపల్లి హైస్కూల్‌కు చెందని టి.స్వామి నాయుడు గెలుపొందారు. ప్రైవేటు యాజమాన్యం నుంచి కూడా విజేతలను ప్రకటించారు. విజేతలకు ఎస్సై చంటి, ఏఎల్ఎస్సీ కోఆర్డినేటర్ రమేష్‌బాబు, ఎంఈఓలు ఆర్.నాగకుమార్, బి.శ్రీనివాసరాజు బహుమతులు అందజేశారు.